# ఘనోపూంటీ

మూలం : వనఫూల్ (బెంగాలీ)

అనువాదం -- ఆర్. వి. లక్ష్మీదేవి

అయిదు సంవత్సరాల తరువాత పూంటీ తిరిగి దేశానికి వస్తున్నాది. దేశం అంటే మోహన్‌పూరు గ్రామం. ఈ మోహన్‌పూరు నుంచి పూంటీ ఒకప్పుడు పారిపోవలసి వచ్చింది. ఆమె దొంగతనంగాని హత్యగాని చెయలేదు. నిజానికి పీనల్ కోడ్‌లో ఏ సెక్షనూ ఆమె గ్రామం విడిచి వెళ్ళిపోవడానికి కారణం కాదు. ఆమె అపరాధమల్లా ఆమె ఒంటి రంగు నలుపు.

దానికి పైగా తండ్రిలేదు, చాలా పేదరాలు. ఎంతోమంది పెళ్ళికొడుకులు ఆమెని చూడ్డానికి వచ్చారు. కాని ఎవ్వరూ ఆమెని వివాహం చేసుకోడానికి ఉత్సాహంతో ముందుకి రాలేదు. విధవరాలైన ఆమె తల్లి, కొంతమంది కాళ్ళు కూడా పట్టుకుంది, కాని నాళ్ళ మనసులు కరగలేదు. శరత్‌బాబు కథ 'అర్క్షణీయ'లో జరిగినట్టే జరిగింది. ఆకథలోలాగే, గ్రామంలో ఒక ధనవంతుడి కొడుకు వున్నాడు. ఒక వడ్డీ వ్యాపారస్థుడి కొడుకు, ధీరేశ్. ఒకేశాఖ వాళ్ళువి. పూంటీ తల్లి, కొంచెం జంకుతూనే, ఒకరోజు, అతని దగ్గర కూతురి పెళ్ళిసంగతి ఎత్తింది. ధీరేశ్, తన ముఖ్యస్నేహితుడు కదమ్‌తో బయుట షికారు తిరిగిరావడానికి బయులుదేరేడు. విధవరాలైన పూంటీ తల్లి చెరువునుంచి నీళ్ళు తీసుకురావడానికి వెడుతున్నాది. అవకాశం దొరికిందని, పూంటీ తల్లి తన కూతురిగురించి చెప్పింది. ధీరేశ్ కొంచెం సుముఖంగా వుండి, అభయుం ఇస్తే, అతని తండ్రి కాళ్ళమీద పడదామని ఆమె ఉద్దేశం. ఆవిడ చెప్పినదంతా విని, ధీరేశ్ కొన్ని క్షణాలు కనుబొమలు పైకెత్తి చూస్తూ నిలబ



డ్డాడు. కుర్రాడు బి.ఎస్.సి వరకు చదివేడు. హఠాత్తుగా, "నెప్ట్యూన్ పేరు విన్నారా?" అని ఆమెని అడిగేడు. ఆమె, "నెప్ట్యూన్? లేదే. నేపాల్ అన్న పేరు విన్నాను. హాం, అవును, మా పులూ మరిది కొడుక్కి 'నెంగ్యూ' అన్న పేరు పెట్టేరు. వాళ్ళ సంగతే అడుగుతున్నావా? వాళ్ళు ఇక్కడ లేరు ---- "

కదమ్, "ఆ మాట వదిలెయ్యండి పిన్నిగారూ! ధీరూ పెళ్ళి నిశ్చయం అయిపోయింది, ఒకరితో ---"

"ఓ! ఆ విషయం నాకు తెలియదు, నాయనా! మా పూంటీకి ఏదైనా మంచి సంబంధం చూపిపెట్టండి, బాబూ! మీరు --"

"ప్రయత్నం చేస్తాం!"

పూంటీ తల్లి వెళ్ళిపోయిన తరువాత కదమ్,

"హఠాత్తుగా నెప్ట్యూన్ సంగతి అడిగేవెందుకు?" అన్నాడు.

"పొట్టివాడు చంద్రుడిని అందుకోడానికి ప్రయత్నించేడన్న సామెత వుంది. కాని పొట్టివాడు నెప్ట్యూన్ కోసం చెయ్యి చాచినట్టుంది ఆవిడ చెప్పిన మాట. ఆ సంగతి ఆవిడకి బోధపరుద్దాం అనుకున్నాను. --"

"నీది ఊహే అనుకో --" అని కదమ్ ముగ్ధుడై ధీరేశ్ వైపు చూస్తూ వుండిపోయేడు.

ధీరేశ్, "అమ్మాయి తెల్లగా వుండి వుంటే, బహుశ ఆలోచించి వుందును. కన్ను, ముక్కు తీరు, ఒడ్డు, పొడుగు బాగానే వుంటాయి, ఏమంటావు --"

కదమ్ ఎడం కన్ను చిట్లించి, ఆలోచిస్తున్నట్టు చూసేడు.

ఆ తరువాతనుంచి పూంటీ ఇంటి చుట్టూ గ్రామంలో వున్న రౌడీ యువకులందరూ తిరగడం మొదలు పెట్టేరు. కొందరు ఫ్లూటు వాయించడం, కొందరు ఈలలు వెయ్య, మరి కొందరు ఇంటి ఎదురుగా తిష్టవేసి అశ్లీల సంభాషణలు చెయ్యడం చేసేవారు.

ఆఖరికి, ఒకరోజు, పూంటీని తీసుకుని ఆమె తల్లి, అర్ధరాత్రి చీకట్లో, గ్రామం విడిచి పెట్టి వెళ్ళిపోయింది. ఎక్కడికి వెడుతున్నాదో ఎవ్వరికీ చెప్పలేదు.

* * * * * * * * *

అయిదు సంవత్సరాల తరువాత పూంటీ తన చిన్న తాత కొడుకు చంచల్ కుమార్కి, తను తన భర్తతో మోహన్పూరు వస్తున్నట్టు ఉత్తరం రాసింది. తమ ఇంటిని శుభ్రం చేయించి, సున్నాలు వేయించి వుంచమనీ, దాని కోసం రెండువందల రూపాయలు టెలిగ్రాం

ఆమె ఎంతో డబ్బు సంపాదించింది. ఇల్లు కట్టుకుంది. కారు కొనుక్కుంది. ఎన్నో చీరెలు, బట్టలు, ఎన్నో నగలు కొనుక్కుంది. ఆమె ఇప్పుడు పేరుమోసిన అభినేత్రి. ఎందరో ఆమె వెంట వెంటతిరుగుతారు. కాని . . . . .

మనియార్డరు ద్వారా పంపేననీ రాసింది.

ఊళ్ళోవాళ్ళ ఆశ్చర్యానికి మేరలేకపోయింది.

వస్తున్నామని రాసిన రోజుకి పూంటీ, ఆమె భర్తా స్వగ్రామం చేరేరు. వాళ్ళని చూసి గ్రామస్తుల ఆశ్చర్యం రెట్టింపు అయింది. పూంటీ రాణీలా అలంకరించుకుంది. వాళ్ళతో పాటు ముగ్గురు మగ నౌకర్లు, ఇద్దరు దాసీలు వచ్చేరు. పూంటీ భర్త అనింద్యకాంతి కుమార్ రాజకుమారుడిలా మెరిసిపోతున్నాడు. అందరికీ కళ్ళు చెదిరిపోయాయి. పూంటీ, "అమ్మ చనిపోయి సంవత్సరం పైగా అయింది. ఆమె సంవత్సరీక శ్రాద్ధ కర్మ తరువాత స్వంత గ్రామంలో వాళ్ళందరికీ భోజనాలు పెట్టమని ఆమె చివరి కోరికగా చెప్పింది. అందుకనే మేము ముఖ్యంగా ఇక్కడికి వచ్చింది --"అని వూళ్ళో వాళ్ళతో చెప్పింది.

అతి ఘనంగా ఊరి వాళ్ళందరికీ బ్రహ్మాండమైన విందు భోజనం ఏర్పాటు చేసింది ఆమె. గ్రామంలోని పిల్లలూ, పెద్దలూ, ఆడా, మగా, పైజాతుల వాళ్ళు, తక్కువ జాతి వాళ్ళైన హరిజనులూ, ఎవ్వరినీ మినహాయించకుండా అందరినీ ఆహ్వానించింది. పేదవాళ్ళకీ, కష్టంలో వున్నవాళ్ళకీ బట్టలూ, నగదూ ఇచ్చింది. గ్రామంలోని స్కూలుకీ, కోవెలకీ భారీగా విరాళాలు ఇచ్చింది. ధీరేశ్, కదమ్ కూడా 'హాం' అని నోళ్ళు తెరుచుకు వుండిపోయేరు. పేదసాదలందరూ పూంటీని నూరేళ్ళు చల్లగా వుండమని ఆశీర్వదించేరు.

ఇంతకుముందు పూంటీ రూపాన్ని వెక్కిరించి, వెటకారంగా మాట్లాడిన ఇరుగు పొరుగు వాళ్ళందరూ గుంపుగా వచ్చి, వెయ్యినోళ్ళతో పూంటీ అందాన్నీ, అదృష్టాన్ని పొగడడానికి సిగ్గుపడలేదు. పూంటీ భర్త చుట్టూ గ్రామంలోని యువకులందరూ పిచ్చిగా తిరిగేరు. ఎంత అందగాడో అంతటి గుణవంతుడు. ఎంత ధనవంతుడో అంత దయాశీలుడు. అడిగినా అడక్కపోయినా, గ్రామంలోని ఫుట్ బాల్ క్లబ్బుకీ, ఎమెచూర్ నాటకం కంపెనీకి, హరిసభలకీ ధారాళంగా చందాలిచ్చేడు. ఊళ్ళో యువకులతో ఒక రోజు నాటకంలో వేషం కూడా వేసాడు. ఏం తియ్యని గొంతు!

రెండు వారాలు గ్రామవాసులందర్నీ ఆనందలహరిలో ముంచి, ఆఖరికి వాళ్ళ దగ్గర సెలవు తీసుకుని బయలుదేరేరు పూంటీ, ఆమె భర్తా.

* * * * * * * * *

బర్ద్వాను స్టేషను.

పూంటీ, "చునోదా, ఇక్కడే దిగిపోతావా?" అంది.

"అవును, డబ్బులిచ్చెయ్యి. "

"ఇస్తున్నాను. రెండువందలూ తీసుకుంటావా?"

"సరే, అంతకే మనం మాట్లాడుకున్నాం కదా?"

"మంచిది, ఇంద తీసుకో --"

డబ్బు బయటికి తీసింది. ఆ తరువాత, "ఎలాగో స్వప్నంలోలాగ, ఇట్టే గడిచిపోయాయి, పదిహేను రోజులూనూ! ఆహా! అదే నిజమయితే --"

"కల ఎప్పుడైనా నిజం అవుతుందా? వెడుతున్నాను. మళ్ళీ స్టూడియోలో కలుద్దాం --"

చునోదా -- ఉరఫ్ చునీలాల్ దిగిపోయాడు.

పూంటీ, చునీలాల్ ఉభయులూ నటీనటులు. తల్లి ఆఖరి కోరిక తీర్చడం కోసం పూంటీ చునీలాల్ని గ్రామానికి తీసుకుని వెళ్ళింది. అక్కడ ఇద్దరూ భార్యాభర్తల్లా అభినయం చేసి వచ్చారు.

రైలు నడుస్తోంది. మొదటి తరగతి పెట్టెలో పూంటీ ఒక్కతే, తెరిచిన కిటికీ లోనుంచి దిఙ్మండలాన్ని చూస్తూ కూర్చుని వుంది. తలమీద జుట్టు గాలికి ఎగురుతోంది. చీర అస్తవ్యస్తంగా వుంది. కాని వాటి మీద ఆమె దృష్టి లేదు. నిస్తబ్ధంగా కూర్చుని వుంది.

ఆమె ఎంతో డబ్బు సంపాదించింది. ఇల్లు కట్టుకుంది. కారు కొనుక్కుంది. ఎన్నో చీరెలు, బట్టలు, ఎన్నో నగలు కొనుక్కుంది. ఆమె ఇప్పుడు పేరుమోసిన అభినేత్రి. ఎందరో ఆమె వెంట వెంట తిరుగుతారు. కాని ---

హఠాత్తుగా ఆమె కళ్ళంట, కొన్ని బొట్లు నీళ్ళు కారేయి. ★

ఊరికి వెళ్ళిన అత్తగారు మరణించిందని వేంకటేశ్వరావుకి టెలిగ్రాం వచ్చింది.

అందులో ఆమెను శవపేటికలో ఖననం చేయాలో, లేక దహనం చేయాలో తెలియచేయవలసిందిగా ఉంది.

ఎందుకైనా మంచిది రెండూ చేసేయమని వేంకటేశ్వరావు తిరుగు టెలిగ్రాం ఇచ్చాడు.